## క్లుప్తంగా

### ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుకగా డీఏను ప్రకటించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫరీష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడచిపోయిందని.. ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. సంక్రాంతి కానుకగానైనా డీఏను ప్రకటించాలని కోరారు. అలాగే 2023 జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాలని, ఇప్పటికే 18 నెలలు గడచి పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే 12వ వేతన కమిషన్‌ను నియమించి సముచిత రీతిలో మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు.

### భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం



శ్రీ కాశీ విశ్వేశ్వరునికి అన్నాభిషేకం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రధాన అర్చకులు పిడతల గోపాల కృష్ణ, మురళీకృష్ణ శర్మల ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సహస్ర లింగార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నపు రాశిని మహాలింగంగా తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

### దుర్గమ్మ సన్నిధిలో పౌర్ణమి పూజలు



ఊరేగింపుగా కలశాలను తీసుకువస్తున్న వేదపండితులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనది జలాలు నింపిన తొమ్మిది కలశాలతో అమ్మవారికి నవ కలశస్నపనం నిర్వహించారు. అర్చకుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఉభయదారులు కలశాలతో ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. కలశంలోని జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ యాగ మండపంలో భక్తులచే చండీహోమం నిర్వహింపజేశారు. తర్వాత 108 ముత్తయిదవులతో దీపాలను వెలిగించి శత దీపాలంకరణ సేవా నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### అలరించిన నృత్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్ : కడప శివార్లలోని శిల్పారామంలో సోమవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలనాధికారి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శకులు సాయంత్రం భోగి మంటలు వేసి ఆనందించారు. సిబ్బంది శిల్పారామం ఆవరణలో రంగురంగుల ముగ్గులు తీర్చి సందర్శకులను అలరించారు. భోగి మంట చుట్టూ చప్పట్లు చరుస్తూ గొబ్బెమ్మ పాటలు పాడారు. బాలలు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా కళా వేదికపై చిత్తూరు జిల్లా బౌరెడ్డిపల్లి కళా తరంగిణి బృందం చేసిన నృత్యాలు ఉర్రూత లూగించాయి. ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### దుప్పట్లు పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం యాచకులు, నిరాశ్రయులకు దుప్పట్లను పంచి పెట్టారు. నగరంలోని ఓల్డ్ కలెక్టరేట్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్, మహావీర్ సర్కిల్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లోని పేదలు, ఇందిరానగర్ దగ్గర ఉన్న వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేంద్ర కమిటీ సూచన మేరకు కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి, డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, జిల్లా కమిటీ ట్రెజరర్ కష్టారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డన్న, అవ్వరు సుబ్బయ్య, లేబాకు కష్టారెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎల్లారెడ్డి, సమ్మెట సత్యనారాయణ, చెన్నకేశవ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు.

## కమనీయం.. కల్యాణం



కల్యాణమూర్తులుగా శ్రీ గోదాదేవి, రంగనాథస్వామి

కడప కల్చరల్ : తిరుమల తొలిగడప దేవునికడపలో సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీ గోదాదేవి, శ్రీభోగశ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి ఆలయంలో ప్రత్యేకంగా గోదాదేవి రచించిన పాశురాలను రోజూ ఒక్కొక్కటిగా పూజల్లో భక్తులు ఆలపిస్తున్నారు. ఆలయం వెనుక ప్రత్యేకించి నిర్మించిన అధ్యయన మండపంలో నెల రోజులపాటు పాశురాలను ఆలపించారు. చివరగా ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి స్వామి, అమ్మవార్లను అలంకరించి కొలువు దీర్చారు. అర్చకులు ఈ కల్యాణం ప్రత్యేకతను వివరిస్తూ గోదాదేవి చరిత్రను తెలిపారు. కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి మాంగల్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను అశ్వ వాహనంపై దేవునికడప గ్రామం మాడవీధుల్లో ఊరేగించారు.

## అంబేడ్కర్ ఆలోచన విధానం కొనసాగిద్దాం



దువ్వూరు మండల కమిటీ నాయకులతో మాల మహానాడు జిల్లా నాయకులు

కడప కార్పొరేషన్ : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని కొనసాగించేందుకు మాల మహానాడు నాయకులు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెవుల తిరుపాల్, మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎద్దుల వసంత్ కోరారు. సోమవారం కడపలోని సంఘ కార్యాలయంలో దువ్వూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు కిషోర్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక జరిగిందన్నారు. మాలల హక్కుల కోసం పోరాటం చేయడం ద్వారా సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు.

**నూతన కమిటీ :** దువ్వూరు మండల సలహాదారులుగా బి.చెంద్రాయుడు, వై.అజయ్ బాబు, దువ్వూరు మండల మహిళ అధ్యక్షురాలుగా సుశీలమ్మ, దువ్వూరు మండల అధ్యక్షుడుగా సన్నపునూలు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల ఓబులేష్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబ్బరపు సురేష్, ఉపాధ్యక్షుడు బిర్రు చెన్నయ్య, అధికార ప్రతినిధి మెల్ల రాజేశేఖర్, యూత్ ఉపాధ్యక్షులు రామక్క సునీల్, కార్యదర్శి మెల్ల ప్రతాప్ పాల్గొన్నారు.

## పండుగ సంప్రదాయాలు కాపాడుకుందాం



కొత్తాస్ గణేష్ అభిరాంను సత్కరిస్తున్న ఇంటాక్ సభ్యులు

కడప కల్చరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. పండుగ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముగింపు వేడుకల్లో భాగంగా కార్యక్రమానికి వెన్నుదన్నుగా నిలిచిన కొత్తాస్ గణేష్ అభిరాంను ఘనంగా సత్కరించారు. మన సంప్రదాయాల రక్షణ కోసం సంస్థకు ఆయన అందిస్తున్న సహకారాన్ని సభ్యులంతా అభినందించారు. కొత్తాస్ ప్రతినిధులు మాట్లాడుతూ నేటి తరానికి మన పండుగలు, వాటి గొప్పతనాన్ని గుర్తు చేయాలన్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు పిల్లలకు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పాలన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ, సంజీవరెడ్డి, తాహిన్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రార్థన చేసిన వారికే దైవ కృప



దైవ సందేశం అందిస్తున్న దైవ జనులు ప్రసన్న కుమార్

కడప కల్చరల్ : నేటి సమాజంలో ప్రార్థనలు చేసిన వారికే దైవ కృప లభిస్తుందని డాక్టర్ టి.డి.ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం నగర పరిధిలోని 48 డివిజన్ కృపా కాలనీలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరాన్ని దైవజనులు ప్రసన్నకుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయనతోపాటు డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ అబిద్, డాక్టర్ అయేష, డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ సర్వమత సమ్మేళనమే భారతీయ సంస్కృతి అన్నారు. హిందూ ముస్లిం క్రైస్తవ మతాల ప్రజలు ఐకమత్యంతో జీవించాలని సూచించారు. కృపా కాలనీ, బుడగజంగం కాలనీ, లోహియానగర్ ప్రాంతాలలో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న పాస్టర్ మహేష్ కుటుంబాన్ని వారు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు ఐజాక్, శ్రీనివాసులు, సింగర్ ప్రతిభ, టీచర్ డేవిడ్ పాస్టర్లు శేషం ప్రసాద్ రావు, మల్లెం విజయ భాస్కర్, పి.శ్రీనివాసులు, మహిళా నాయకురాలు విమల, బుడగజంగం పెద్దలు పత్తికొండ కందనాతి, తాడిపత్రి ఎం.సుంకన్న, గుత్తి ఏ.ఈశ్వరయ్య, ఈ నరసప్ప, స్థానిక బుడగజంగం నాయకులు డి.రాజు, డి.శ్రీరాములు, రామయ్య సంఘ పెద్దలు, సచివాలయం అధికారులు రోశయ్య, విశ్వాసులు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అన్ని మతాల ప్రజలు హాజరై ప్రపంచ ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేసి ప్రేమ విందులో పాల్గొన్నారు.

## పేదలకు సాయం చేయడంలోనే ఆనందం



రాయచోటి అర్బన్: పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ దంపతులు



రాజంపేట: చీరలను పంపిణీ చేస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డిలు

రాయచోటి అర్బన్ : పేదలకు సాయం చేయడంలోనే ఆనందం ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథరామి రెడ్డి, కౌన్సిలర్ విజయమ్మ దంపతులు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం సుమారు 200 మంది మున్సిపల్ కార్మికులకు వైస్ చైర్మన్ దంపతులు బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత చెన్నయ్య అగ్గిరాముడు తదితరులు పాల్గొన్నారు.

**చొప్పా సోదరుల ఆధ్వర్యంలో..**

రాజంపేట : చొప్పా సోదరుల ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. 500 మంది మహిళలు చీరలను అందుకున్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి దంపతులు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రాజంపేట రూరల్ ఏరియాల్లోని సిద్దులపల్లె, సిద్దులపల్లె హరిజనవాడ, హేమాద్రివారిపల్లెతో పాటు దళితవాడకు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేయడంతో సిద్దులపల్లెలోని చొప్పా నివాస్ వద్ద సంక్రాంతి సందడి వాతవరణం నెలకొంది. కార్యక్రమంలో ఏయూ సిబ్బంది పాల్గొన్నారు.

## పగిలిన తాగునీటి పైప్‌లైన్



మాధవరం-1 గ్రామ పంచాయతీలో వృథాగా పోతున్న నీరు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని రోడ్డు నెంబర్ 16లో పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోందని ఆ ప్రాంత మహిళలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో రహదారి జలమయం అయ్యిందన్నారు. సంక్రాంతి వేడుకల్లో గృహాల ముందర నీరు ప్రవహిస్తుండటంతో తాము ఇంటి ముందర పండుగకు కల్లాపు చల్లుకొని ముగ్గులు కూడా వేసుకోలేక పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు వృథా చేయవద్దు అని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా రహదారుల వెంబడి నీరు ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్యను వివరణ కోరగా పంచాయతీలోని రోడ్డు నెంబర్ 16లో కొన్ని రోజులుగా తాగునీటి పైపు డ్యామేజ్ అయిన విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. ఆ ప్రాంతానికి ఇంజనీరింగ్ అసిస్టెంటు వెళ్లాడని సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా కూలీలు రావడంలేదని పండుగ అనంతరం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## వేడుకగా 'భోగి'



భాగ్యనగర్ కాలనీలో..

కడప కార్పొరేషన్ : సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగి వేడుకను కడప నగరంలో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు, చిన్నపిల్లలు ఆదివారం రాత్రి ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగవల్లులు వేశారు. తెల్లవారుజామునే భోగిమంటలు వేసి అందులో నీళ్ల కాచుకొని రేగుపళ్లతో తలంటు స్నానాలు చేసి, కొత్త బట్టలు ధరించారు. ఇంటికి వచ్చిన కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులతో కలిసి పిండివంటలు చేసుకొని ఆరగించారు. మొబైల్ కాల్స్, సోషల్ మీడియా వేదికగా దూరంగా ఉన్న బంధుమిత్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

- నగర మేయర్ కె.సురేష్ బాబు ఫామ్‌హౌస్‌లో భోగి పండుగ నిర్వహించారు. ఆయన భోగి మంట వేసి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ తనయుడు అమరేష్ బాబు, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి, యల్లారెడ్డి, కేవీ పాల్గొన్నారు.

## కష్టపడి పని చేసే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు



మేయర్ సురేష్‌బాబును సన్మానిస్తున్న కడప సౌత్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కష్టపడి పని చేసే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కడప సౌత్‌జోన్ అధ్యక్షులుగా నియమితులైన శంకరాపురానికి చెందిన పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డిని ఆయన అభినందించారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మేయర్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవి ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి రావడానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, రఘు, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు మార్గదర్శి స్వామి వివేకానంద



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు

కడప కల్చరల్ : స్వామి వివేకానంద యువతకు మార్గదర్శి అని మానవత సంస్థ ప్రతినిధులు కొనియాడారు. సోమవారం వివేకానందుని జయంతి వేడుకలను నగరంలోని సింగపూర్ సిటీలో గల వివేకానందుని విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, డైరెక్టర్స్ రాటాల గోపి డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, కో చైర్మన్ పి.సుబ్బరాయుడు, అవ్వరు సుబ్బయ్య, లేపాకు కృష్ణారెడ్డి, నారాయణ పూలమాల అలంకరించి నివాళులు అర్పించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలకు వ్యాప్తి చేసిన వివేకానందుడు గొప్ప మహనీయుడు అన్నారు. డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి మాట్లాడుతూ హిందూ మతం గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు ఇనుమడింపజేశారని వివరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెనగలూరులో తేలికపాటి వర్షం



మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

పెనగలూరు : సంక్రాంతి అంటే ఏడాదికి ఒకసారి వచ్చి ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ. భోగి పండుగ రోజే తుంపర వర్షం ప్రారంభమవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. 40 సంవత్సరాల క్రితం ఇలాగే మూడు పండుగలకు వాన పడిందని, ఆ తరువాత ఈ ఏడాది పండుగరోజు వర్షం కురిసిందని పెద్దలు మాట్లాడుకుంటున్నారు. తుంపర వర్షంతో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు పిండి వంటకాలు చేసుకొనే వారు ఇక్కట్ల ఎదుర్కొన్నారు. పొలాల్లో ఆరుతడి పంటలు రైతులు ముందుగానే వేశారు. ఈ వర్షం వల్ల ఈ ఆరుతడి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

### సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలి



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ఈ సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రజలందరూ సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలు.. అందరూ ఆనందంగా జరుపుకోవాలని మనసారా కోరుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు, రైతులకు వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన పి. నరేన్ రామాంజులరెడ్డి**



పి.నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : ప్రజలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు తులతూగాలని కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. అలాగే ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి కూడా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

### దరఖాస్తు గడువు పొడిగించండి

వేంపల్లె : జిల్లాలో వివిధ కార్పొరేషన్ల కింద లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయడానికి ఈ నెల 8వ తేదీన బీసీ సేవా సహకార సంస్థ విడుదల చేసిన ప్రకటనలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ కార్పొరేషన్లకు చెందిన లబ్ధిదారుల ఎంపికకు 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అంతేకాక వివిధ కులాలకు చెందిన అభ్యర్థులకు వారి కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందేందుకు ఈ గడువులో ఐదు రోజులు సెలవు దినాలు వచ్చినందున అవసరమైన అభ్యర్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 30 తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించాలని కోరారు.

### 'అంతిమ' బాంధవులు

జమ్మలమడుగు : ప్రతి మనిషికీ మరణమనేది ఖాయం. ఆ అంతిమ ఘడియల్లో మోసేందుకు నలుగురు ఉండాలని కోరుకుంటారు ఎవరైనా. జమ్మలమడుగు ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. కారణం తెలియదు కానీ.. కన్నవారు, రక్తసంబంధీకులు సదరు యువకుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకురాలేదు. అటువంటి పరిస్థితిలో అన్నీ తామై సంప్రదాయం ప్రకారం యువకుడికి అంత్యక్రియలు నిర్వహించి మే ఐ హెల్ప్ యూ సంస్థ ప్రతినిధులు మానవత్వం చాటారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కె.సురేంద్రాకుమార్ (26) అనే యువకుడు మృతి చెందాడు. అయితే సురేంద్రాకుమార్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు కానీ, బంధువులు కానీ ఎవరూ రాలేదు. దీంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మే ఐ హెల్ప్ యూ సంస్థను ఆశ్రయించారు. సంస్థ ప్రతినిధి సుభహాన్, అతని అనుచరులు సురేంద్రాకుమార్‌కు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరానికి చెందిన ఆర్కే సేవా సమితి రూపొందించిన 2025 క్యాలెండర్లను సోమవారం కడపలోని జిల్లా పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్ థెరిసా, ఏపీజే అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద చిత్రాలతో తయారు చేసిన 2025 క్యాలెండర్ ఇది అన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, రాజశేఖర్, నారాయణ, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..**



కడప ఎడ్యుకేషన్ : కడపలోని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం(ఆర్ఎస్ఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప ఎమ్మెల్యే రెడ్డప్ప మాధవిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసుయాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసపేట శివ, వెంకట సాయి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు లోకేష్, వలసిగాండ్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

**జనం కోసం..**

జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ముద్రించిన లక్ష్మిదేవి క్యాలెండర్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ ముస్లిం మైనార్టీ నాయకుడు అమ్మానుల షేక్ తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి దేవస్థానంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రుద్రమూర్తి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, రుద్ర పారాయణం, భష్మాభిషేకం, నైవేద్యం, మహా మంగళ హారతి తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

**నేడు పడిపూజ**

పులివెందుల పట్టణంలోని కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకటరామిరెడ్డి గురుస్వామి తెలిపారు. మకరసంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం సందర్భంగా సాయంత్రం 6గంటలకు పడిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

### రుద్రాభిషేకం

నందలూరు : రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పౌర్ణమి సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ మృత్యుంజయేశ్వర స్వామికి రుద్రాభిషేకాన్ని ఆలయ అర్చకులు నరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.